బుద్ధుడి చూపిన మార్గంలో నడుస్తూ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించాలి




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సమస్యల కోసం ఏబీవీపీ నిరహార దీక్ష




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 290 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 15 అక్టోబర్ 2025

# బానకచర్ల విషయంలో ఏపీని నిలువరించండి


**బానకచర్లపై పోలవరం - బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో లేఖ రాసిన తెలంగాణ**

**బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో వెల్లడి**

**టెండర్, భూసేకరణ విషయంలో ముందుకు వెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):**

పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జల శక్తి కార్యదర్శికి రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. మిగతా 2లో...






## పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు..

**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు: ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం**

**సిట్ పిలిచినప్పుడు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్ రీసెట్ చేయాలని సూచన**

**ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం**

**తదుపరి విచారణ వరకు ప్రభాకర్ రావు అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కొనసాగింపు**




## ఇది దళితుల సమస్య..

**ఐపీఎస్ పూరన్ కుమార్ మృతిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు**

**ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ పూరన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన రాహుల్ గాంధీ**

**ప్రణాళికాబద్ధంగా ఆయన కెరీర్‌ను దెబ్బతీశారని విమర్శ**

**ఇది కుటుంబ సమస్య కాదు, దళితుల సమస్య అని వ్యాఖ్య**

**ప్రధాని మోదీ, సీఎం సైనీ వెంటనే స్పందించాలని డిమాండ్**

# విశాఖకు గూగుల్ డేటా సెంటర్




**సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి**

**ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):**

ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఢిల్లీలో ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా 'భారత్ ఏఐ శక్తి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చాం. ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నాం. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి. డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఏఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవి. మిగతా 2లో...



## సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

**హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది**

**ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు మిగతా 2లో...



## ప్రధాని మోదీ హయాంలో జీరో టెర్రరిజం పాలసీ



**భారత్ ను కాపాడే బలమైన కవచం ఎన్ఎస్‌జీ హబ్ : అమిత్ షా**

**హర్యానాలోని మానేసర్‌లో ఎన్ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**కమాండోల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) దేశానికి ఒక బలమైన రక్షణ కవచంలా పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు. హర్యానాలోని మానేసర్‌లో మంగళవారం జరిగిన ఎన్ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి ఆయన నివాళు లర్పించారు. మిగతా 2లో...

## అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

**మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**పోలీసులకు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు వేణుగోపాల్ రావు**

**ఆయనతో పాటు మరో 60 మంది కూడా లొంగుబాటు**

**మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసుల ఎదుట హాజరు**

**పార్టీ విధానాలతో విభేదాల వల్లే ఈ నిర్ణయమని సమాచారం**

**దివంగత నేత కిషన్‌జీకి వేణుగోపాల్ స్వయానా సోదరుడు**




## మాగంటి సునీతకు బిఫామ్ అందించిన కెసిఆర్

**హైదరాబాద్,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మిగతా 2లో...



# ఇది దళితుల సమస్య..


## ఐపీఎస్ పూరన్ కుమార్ మృతిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మృతి వెనుక ప్రభుత్వ వివక్ష ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానాలో పూరన్ కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూరన్ కుమార్ మరణం కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదని, ఇది దళితుల సమస్య అని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం ఆయనపై ప్రణాళికాబద్ధంగా వివక్ష చూపిందని, ఆయన మనోధైర్యాన్ని దెబ్బతీసి కెరీర్‌ను నాశనం చేసిందని రాహుల్ ఆరోపించారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, నిష్పక్షపాత విచారణ జరిపించడంలో సీఎం సైనీ పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు.చనిపోయిన తర్వాత కూడా తన భర్తకు సరైన గౌరవం దక్కలేదని పూరన్ కుమార్ భార్య తనతో చెప్పినట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఈ నెల 7న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగుతోంది.

# అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

## మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మావోయిస్టు పార్టీకి అత్యంత కీలకమైన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా ఉన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన తన అనుచరులు 60 మందితో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి ఊహించని షాక్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు.



గత కొంతకాలంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలతో వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లడమే సరైన మార్గమని ఆయన భావించినట్లు సమాచారం. ఇదే విషయంపై పార్టీకి ఆయన రాసిన ఓ లేఖ తీవ్ర కలకలం రేపింది. కొన్ని రోజుల క్రితం, దివంగత మావోయిస్టు నేత, తన సోదరుడైన మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ) పేరుతో రాసిన మరో లేఖలో కూడా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలోనే తాను పార్టీ నుంచి శాశ్వతంగా వైదొలగుతున్నట్లు వేణుగోపాల్ ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీలో ఇకపై కొనసాగలేనని స్పష్టం చేస్తూ ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. ఈ ప్రకటన చేసిన కొన్ని రోజులకే, తన అనుచరులతో కలిసి గడ్చిరోలి పోలీసుల ఎదుట ఆయన లొంగిపోవడం గమనార్హం. ఆయన లొంగుబాటుకు దారితీసిన కచ్చితమైన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# మాగంటి సునీతకు బిఫామ్ అందించిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.

# బానకచర్ల విషయంలో ఏపీని నిలువరించండి

(మొదటి పేజీ తరువాయి)

. బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు ఆ లేఖలో ఆయన గుర్తు చేశారు.డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా, నిబంధనలు మరియు విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు.ఈ విషయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం – బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా నిలువరించాలని, టెండర్ ప్రక్రియ మరియు భూసేకరణ విషయంలో ముందుకు వెళ్లకుండా చూడాలని కోరారు.

# పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు..

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు: ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే..


## ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన తన ఐక్లౌడ్ సహా ఇతర క్లౌడ్ ఖాతాల ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తప్పనిసరిగా అందించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయన అరెస్ట్‌పై మధ్యంతర రక్షణను పొడిగిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది.తాను తన ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను మర్చిపోయానని, అది చాలా పాతదని ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, సిట్ ఎప్పుడు పిలిచినా ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. విచారణ బృందానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేసింది.విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించకపోవడం వల్ల కేసులో పురోగతి లేదని తెలిపారు. ఆయన తన డివైజ్‌లను ఫార్మాట్ చేసి కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది డి.ఎస్. నాయుడు ఖండించారు. తన క్లయింట్ వ్యక్తిగత ఐక్లౌడ్ పాస్‌వర్డ్ మినహా అడిగిన అన్ని వివరాలనూ సిట్‌కు ఇచ్చారని, ఇప్పటికే 11 సార్లు విచారణకు హాజరై 18 గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. భద్రతా నిబంధనల ప్రకారమే డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ నిపుణులు డేటాను తొలగించారని, అందులో తన క్లయింట్ పాత్ర లేదని వివరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభాకర్ రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాపింగ్ చేసిందన్నది ప్రధాన ఆరోపణ. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లారు. ఈ కేసు వెలుగులోకి రావడంతో ఆయన పేరు నిందితుల జాబితాలో చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జూన్ 8న భారత్‌కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొంటున్నారు.

# విశాఖకు గూగుల్ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుంటుంది. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చాం. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనడం సంతోషదాయకం.



విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారు. ప్రధానితో పాటు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేశ్ ప్రధాన పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణం, ఐటీ రంగాన్ని ప్రోత్సహించా. ఐటీతో చాలా కాలంగా అనుసంధానమై ఉన్నా. రియల్‌టైమ్ డేటా, హిస్టారికల్ డేటా సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రత్యేకం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం. ప్రతి కుటుంబానికి ఏఐని దగ్గరచేసేలా ప్రయత్నిస్తాం అని చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ , కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారం అందించారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. గూగుల్ డాటా సెంటర్‌కు అన్ని విధాల ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అనేక మార్పులు వస్తాయని... పలు కంపెనీలు గూగుల్ బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. నైతిక విలువలతో కూడిన ఏఐ టెక్నాలజీ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను 2047నాటికి సగర్వంగా నిలబెట్టాలన్న కల సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచాన్నే మార్చేస్తోందని మరో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. నైపుణ్యం ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు రాబోతున్నాయన్నారు.

-----------

# వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

## సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు



విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచుకునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఢిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

# సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

(మొదటి పేజీ తరువాయి)

. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

# ప్రధాని మోదీ హయాంలో జీరో టెర్రరిజం పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో అమిత్ షా కీలక ప్రకటన చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఎన్ఎస్‌జీ కొత్త హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూలలో హబ్‌లు ఉండగా, అయోధ్యతో వాటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని వివరించారు. దీనివల్ల ఉగ్రవాద ముప్పును వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు.అక్షరధామ్ ఆలయంపై దాడి, 26/11 ముంబై దాడులు, పలు బందీల విముక్తి ఆపరేషన్ల వంటి క్లిష్టమైన సమయాల్లో ఎన్ఎస్‌జీ చూపిన ధైర్యసాహసాలను ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 'జీరో టెర్రరిజం' విధానాన్ని అనుసరిస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు 2019 నుంచి యూఏపీఏ, ఎన్ఐఏ చట్టాలకు సవరణలు, టెర్రర్ ఫండింగ్‌ను అరికట్టేందుకు ఈడీ, పీఎంఎల్ఏకు అధికారాలు, పీఎఫ్ఐపై నిషేధం వంటి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.




సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆర్టికల్ 370 రద్దు వంటి చర్యలతో ఉగ్రవాదుల వెన్ను విరిచామని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్', 'ఆపరేషన్ మహాదేవ్' వంటి ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా, రూ. 141 కోట్ల వ్యయంతో 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ప్రత్యేక శిక్షణా కేంద్రానికి అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఇది కమాండోలకు అత్యాధునిక శిక్షణ అందించనుందని తెలిపారు. అలాగే, 2019 నుంచి సీఏపీఎఫ్ సిబ్బంది 6.50 కోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడ్డారని ఆయన కొనియాడారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి

- దేవాళయాల జోలికి వెళ్ళకండి
- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జోక్యంతో రైల్వే స్టేషన్ సమీపంలో సద్దుమణిగిన ఆలయాల సమస్య





**నంద్యాల, 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి, ఆలయాల జోలికి వెళ్ళకండి, ఎవరూ ఫిర్యాదు చేయకున్నా ఆలయాల పైకప్పు ఎలా తొలగిస్తారు, బాటసారులకు ఇబ్బంది లేకుండా ఉన్న సమూహా ఆలయాలు తొలగించాలని మీకు ఆలోచన ఎందుకు వచ్చింది, దేవుళ్ళకు నిత్యం సేవచేసే ప్రభుత్వ ఉద్యోగి టీచర్ నారాయణను రైల్వే స్టేషన్ లో ఒక రోజంతా ఎలా నిర్భందిస్తారు అంటూ రైల్వే అధికారులను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఫోన్ ద్వారా హెచ్చరించారుమంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్ కు నూనెపల్లి నుంచి వచ్చే రహదారి పక్కన ఉన్న వినాయక గుడి, నాగుల కట్ట శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యం స్వామి, పరమేశ్వరుడు, శ్రీ వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి, నవగ్రహ చిన్న మండపాలు పూర్వం నుంచి ఏర్పాటు చేసుకొని మూలసాగరం, నూనెపల్లి, సాయిబాబా నగర్, ఎం ఎస్ నగర్, తదితర కాలనీల భక్తులు పూజలు చేసూకుంటూ తమ మొక్కుబడులు తీర్చుకీంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారాయణ, వారి మిత్ర బృందం ఈ సామూహిక చిరు ఆలయాల్లో ప్రతి పండుగ ఘనంగా జరుపుకొని అటు వెళ్లే బాటసారులకు అన్న ప్రసాద వితరణ చేస్తూ వస్తున్నారు. ఉన్నట్టుండి నంద్యాల రైల్వే డివిజనల్ ఓ అధికారీ ఇక్కడ ఈ ఆలయాల గోల ఎలా, వెంటనే వాటిని తీసివేయండి అంటూ నంద్యాల రైల్వే పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం, సోమవారం రాత్రి ఆలయాల పర్యవేక్షకుడు నారాయణను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని ఆలయాలపై ఉన్న రేకులు ఉటాహుటిన తొలగించారు. ఇది తెలుసుకున్న నూనెపల్లి, మూలసాగరం, రైల్వే స్టేషన్ ప్రాంతం లోని కాలనీల ప్రజలు, హిందూసంఘాల ప్రతినిధులు సుమారు మూడు వందల మంది ఆలయాల వద్దకు చేరుకొని ఎవరికీ ఇబ్బంది లేని మా ఆలయాలు ఎందుకు తొలగిస్తున్నారని రైల్వే పోలీసులు, అధికారులతో వాదనకు దిగారు. రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎన్. పి.నవీన్ గౌడ్, చింతలపల్లి వాసు తదితరులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఫోన్ ద్వారా సమస్య తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రైల్వే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, దేశ ప్రధాని నంద్యాల జిల్లాకు వస్తున్న సమయంలో ఇలాంటి సరైనవి కాదని, భక్తుల మనోభావాలు కాపాడాలని, తొలగించిన రేకుల షెడ్ వెంటనే వేయాలనీ, పూర్వం నుంచి ఉన్న ఆలయాలు అలాగే యధావిధిగా ఉండేలా రైల్వే అధికారులు చూడాలని కోరడంతో రైల్వే అధికారులు వెనక్కు వెళ్లడంతో సమస్య సద్దుమణిగింది. దీంతో హిందూ సంఘాల ప్రతినిధులు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్, చింతలపల్లి వాసు, శేష సాయి, రంగస్థల కళాకారుడు శివరామిరెడ్డి, కన్నయ్య, బసవరాజు, రాం ప్రసాద్, నాగదీప్, నాగభూషణం, చందు తదితరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ధన్యవాదములు చెప్పారు.

# రాయలసీమలో బహిరంగ సభ ఏర్పాటు చేసే నైతిక హక్కు లేదు

**- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**వేంపల్లె అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు తీరని ద్రోహం చేశారని అలాంటి ఇరువురు నాయకులు రాయలసీమలో బహిరంగ సభ ఏర్పాటు చేసే నైతిక హక్కు లేదని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు బహిరంగ సభలోనైనా రాయలసీమ సమస్యలపై ప్రధాని సిఎం ఇరువురు స్పందించాలని కోరారు. 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టులో ఒకదానిని సీమలో ఏర్పాటు చేయాలని చెప్పారు. కాని మోడీ, చంద్రబాబు పాలనలో ఆ రెండింటిలో ఒకటి కూడా సీమలో ఏర్పాటు చేయకుండా రాయలసీమకు తీరని ద్రోహం చేశారని చెప్పారు. ఎపికి శాశ్వత అన్యాయం చేశారని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంతో పాటు రాయలసీమకు ప్రత్యేక హోదా సంజీవని లాంటిదని చెప్పారు. ప్రత్యేక హోదా భిక్ష కాదని అయినప్పటికీ 11సంవత్సరాలుగా ప్రత్యేక హోదా అమలకు నోచుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారంగా రాయలసీమ ,ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల?ండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిధులు ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం రాయలసీమకు అన్యాయం చేసిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో 13 షెడ్యూల్లో కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మించాలని కాని 11 సంవత్సరాలు అయిన అతి గతి లేదన్నారు. 13వ షెడ్యూల్ ప్రకారం దుగ్గ రాజపట్నంలో మేజర్ ఓడరేవు కేంద్ర ప్రభుత్వం నిర్మించాలని అఊసే లేదన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2008 సంవత్సరంలో కడప, రాయచోటి ,మదనపల్లి ,బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసి కొంతవరకు పూర్తి చేసిందని చెప్పారు. అయితే మోడీ ప్రభుత్వం ఆ రైలు మార్గాన్ని రద్దు చేయడం దురదృష్టకరం అన్నారు. రాయలసీమలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు శ్రీ కాళహస్తి దగ్గర మన్న వరం విద్యుత్ పరికరాల ప్రాజెక్టును గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తే వాటిని మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. కృష్ణానది యాజమాన్యబోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో కాకుండా విజయవాడలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా బోర్డు కు లేఖ రాయడం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే సమస్యలన్నీ ఎప్పుడో పరిష్కారం అయి ఉండేవని చెప్పారు. రాయలసీమ పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే 16వ తేదీ బహిరంగ సభలో విభజన చట్టాల హామీలపై ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత నివ్వాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.



# కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణకు చివరి రోజున అద్భుతమైన స్పందన: సయ్యద్ గౌస్ పీర్



**కడప అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 33 వ డివిజన్ ఇంచార్జ్ షేక్ కరిముల్లా, 46వ డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ ముబారక్ బాషా కాంగ్రెస్ పార్టీ సంతకాల సెకరణ జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్ పీర్ పాల్గొనడంతో ప్రజలు ఇంకా ఉత్సాహవంతంగా ముందుకు వచ్చారు, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు రాహుల్ గాంధీ ప్రారంభించిన ఈ కార్యక్రమం రాజ్యాంగబద్ధంగా జరుగుతున్నదని, రాజ్యాంగం లోని మన ఓటు హక్కును మనం సద్వినియోగించు కోలేకపోవడం బాధాకరమని, ఈ విషయంపై ఎలక్షన్ కమిషన్ కూడా స్పందించకపోవడం తో ఈ ఉద్యమం మొదలు పెట్టామని, ఈ ఉద్యమాన్ని పిసిసి అధ్యక్షు రాలు షర్మిలమ్మ నాయకత్వంలో డిసిసి అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆధ్వర్యంలో సుమారు నెలరోజులుగా విజయవంతంగా కొనసాగుతున్నదని, కడప నగరంలో దాదాపు 50 డివిజన్లలలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేస్తున్నారని, ఇందుకు కారణం ప్రజలకు ఓటు చోరి గురించి అవగాహన వచ్చిందని తెలిపారు. ఈ 50 డివిజన్లలో పెద్ద ఎత్తున సంతకాలు సేకరణ జరిగిందని, ఈరోజు చివరి రోజుగా సంతకాల సేకరణ జరుపుతున్నామని తెలిపారు. ఈ సంతకాల సేకరణ పత్రాలను అలాగే కడప జిల్లాలోని ఏడు నియోజకవర్గాల సంతకాల సేకరణ పత్రాలను జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతికి అందజేస్తామని అక్కడినుండి రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలమ్మకు అందుతాయని, అక్కడ నుండి కేంద్రానికి పంపుతారు. ఇలా సేకరించిన సంతకాల ద్వారా ప్రజల మద్దతు ఎలా ఉన్నదో ఎలక్షన్ కమిషన్కు తెలిపి, అయ్యా మీరు పార్టీల పరంగా పని చేయవద్దు, రాజ్యాంగపరంగా పనిచేయాలి, చూడండి ఓట్ల చోరీపై ప్రజల స్పందన అని చీఫ్ ఎలక్షన్ కమిషన్ తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్డీఏ కూటమిలో ఉండే ప్రత్యేక పార్టీలు బిజెపికి కొమ్ము కాస్తున్నాయని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసైనా బిజెపి గద్దెనెక్కాలని ఇలా ఓటు చోరీలకుఇలా పాల్పడుతుందని, మన రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు ఎందుకు ఓట్ల చోరీ గురించి మాట్లాడటం లేదు అంటే బిజెపికి తొొత్తులుగా పనిచేస్తున్నాయి కాబట్టి, ఈ ఓట్ చోరీ గురించి రాహుల్ గాంధీ గారు ఆధారాలతో సహా మీడియా ముందు ఉంచారు, అందులో నిజాలులేని పక్షాన ఎందుకు అధికార పార్టీ ఖండించలేదు, ఇవి ప్రజలు గమనించారు కాబట్టే కాంగ్రెస్కు మద్దతు తెలిపారని పెద్ద ఎత్తున సంతకాల సేకరణ జరిగిందని, కాబట్టి ప్రజల ఆలోచించుకుని రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుతో ప్రజల తరఫున నిలబడే కాంగ్రెస్ పార్టీని ఎన్నుకోవాలని, రాబోయే ఎలక్షన్లలో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని, లోకల్ ఎలక్షన్ లైనా, ఎమ్మెల్యే ఎలక్షన్ , ఎంపీ ఎలక్షన్లైన అన్నిటిలోనూ ప్రలోభాలకు లొంగకుండా మీ ఓటు హక్కును మంచిగా ఉపయోగించి రాష్ట్రంలో షర్మిలమ్మను సీఎం గా, కేంద్రంలో రాహుల్ గాంధీని పిఎంగా చేయాలని సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. దాసరి శ్రీనివాసులు, షేక్ షామీర్ హుస్సేన్, సిద్ధిక్, సద్దాం పలువురు కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# బుద్ధుడి చూపిన మార్గంలో నడుస్తూ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించాలి



**చిట్యాల అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలోడాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భౌద్ధమతం స్వీకరించిన రోజును పురస్కరించుకుని ముందుగా గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలు వేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హిందువుగా పుట్టి హిందువుగా మరణించనని భారత దేశంలో ఉన్న అన్ని మతాల గురించి తెలుసుకొని చివరకు గౌతమ బుద్ధుడి బోధనలు సూక్తులు సిద్ధాంతాలు నచ్చి బౌద్ధమతాన్ని 14 ఆక్టోబర్ 1956న 5లక్షల మందితో మహారాష్ట్రలోని నాగపూర్ లో బౌద్ధ మతాన్ని స్వీకరించాడని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గడ్డం సదానందం కట్కూరి మొగిలి చందర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు

# సమస్యల కోసం ఏబీవీపీ నిరహార దీక్ష

- నూతన బస్టాండు ప్రారంభించక పోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తాం





**చిట్యాల అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో. ఏబీవీపీ చిట్యాల శాఖ ఆధ్వర్యంలో నిరహార దీక్ష నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజు కుమార్ మరియు విభాగ్ కన్వీనర్ సుజిత్ మాట్లాడుతూ చిట్యాల మండల కేంద్రంలో బడి పక్కనే బార్ ఉన్న అధికారులు పట్టించుకోక పోవడం హాస్యాస్పదం.. అన్నారు విద్యార్థినిల కోసం పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలని,ప్రభుత్వం జూనియర్ కళాశాలలో టాయిలెట్‌లు లేకపోవడం సిగ్గు చేటు అన్నారు,వెంటనే బస్టాండ్ ప్రారంభించాక పోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తాం అని హెచ్చరించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే స్పందించకపోతే ఉద్రిక్తంగా ఉద్యమం. చేపడతామన్నారు. నగర కార్యదర్శి అజయ్, కళాశాల అధ్యక్షుడు కౌశిక్,శేషి వర్ధన్, అబిరామ్,గణేశ్,హేమంత్,జయ ప్రకాష్, వినయ్,సూరజ్,సాయి చరణ్,నాని, కిరణ్, ప్రణయ్,మహేష్,శంకర్,అభినయ్,రామకృష్ణ ,వరుణ్,తేజ ,అజయ్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి: బీఆర్ఎస్

**యాదాద్రి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో మంగళవారం రోజున బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం ఏర్పాటుచేసిన సమావేశంలో తాజామాజీ ఉపసర్పంచ్ పల్లెపాటి మాధవులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారి ఇష్టానుసారంగా మల్లాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకే ఇండ్లను కేటాయించడం సరికాదన్నారు. యాదగిరిగుట్ట మండలంలో గ్రామాల వారిగా ప్రజలు ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలకు తక్కువగా ఇల్లు కేటాయించడం తక్కువ ప్రజలున్న గ్రామాలకు ఎక్కువగా ఇండ్లు కేటాయించడం ఈ ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది.మా గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నారు.ఎక్కువ కావాలని అడిగి తెచ్చే నాయకుడు ఇందిరమ్మ కమిటీలో లేడు.కానీ ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ప్రభుత్వ పథకం రైతుబంధు,రైతు బీమా,కల్యాణ లక్ష్మి,కెసిఆర్ న్యూట్రిషన్ కిట్టు,మరెన్నో ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందింది అది కేసిఆర్ ఘనత.ఇప్పటికైనా ఇందిరమ్మ కమిటీలకు అవకాశం ఉంది. అర్హులైన నిరుపేదలపైన కాంగ్రెస్ , బీఆర్ఎస్ , బిజెపి , సిపిఐ, పార్టీలకు చెందిన వారికి బేదాభిప్రాయాలు లేకుండా ఇందిరమ్మ ఇల్లు కేటాయించి మీ గౌరవాన్ని నిలుపుకోండి అని బీఆర్ఎస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాము.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కారింగుల కిష్టయ్య,కర్రె చంద్రశేఖర్, బీఆర్ఎస్వి మండల అధ్యక్షులు ఒగ్గు మల్లేష్,సోషల్ మీడియా కన్వీనర్ ఇండ్ల ప్రసాద్,దుద్దురు రాజు,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆలేరు భువనగిరి ఎమ్మెల్యేలు




**యాదాద్రి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి.ఆలేరు అభివృద్ధి కోసం గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం పనుల పురోగతి తెలుసుకోవడం జరిగింది.ఆలేరు అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు అన్ని విజయవంతం చేస్తున్న సందర్భంగా సీఎం ఎమ్మెల్యేని అభినందించారు.ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించడం జరిగింది.రాబోయే ఎన్నికల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి విజయవంతం చేయగలరని కోరడం జరిగింది.పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు టికెట్ ఇచ్చి గెలిపించగలరని కోరడం జరిగింది.

PCW తెలుగు దినపత్రిక
బుధవారం 15 అక్టోబర్ 2025

## జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రారంభం

- పశు వైద్యాధికారి డాక్టరు శ్రీ ప్రియ



**వెల్గటూర్,అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పశువైద్య కేంద్రం వెల్గటూర్ మండల పరిధిలో గల గ్రామాలలో నేటి నుండి ఈనెల14. 11.25 వరకు పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేయ బడునని డాక్టర్ పి శ్రీ ప్రియ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతుల ందరూ పశువులకు టీకాలు వేయించి వ్యాధి బారిన పడకుండా మీ పశువులను రక్షించుకోవాలి ఆమె విజ్ఞప్తి చేస్తున్నారు. మొదట స్తంభంపల్లి గ్రామంలో పశువులకి గాలికుంటు టీకాల కార్యక్రమం చేస్తున్నామని మండల పశువైద్యాధికారి తెలిపారు.

## విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



**దంతాలపల్లి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయ హెచ్చరించారు మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పాటు పెద్ద ముప్పారం లోని ఎస్సీ వరుసతి గృహాన్ని అకస్మికంగా ఆమె తనిఖీ చేశారు ఈ సందర్భంగా సిబ్బంది విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మెనూ ప్రకారం మాత్రమే ఆహారంను అందించాలని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వార్డెన్లు అందుబాటులో ఉండి విద్యార్థుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏషిపోయిన వెంకన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్



**దంతాలపల్లి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల మండల కేంద్రంతోపాటు రామజపురం గ్రామంలో మృతి చెందిన కుటుంబ లను మంగళవారం ప్రభుత్వపరంగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బట్టి నాయకులు మధుకర్ రెడ్డి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి అక్టోబర్ 14 (పిసీడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం పగిడిపల్లి గ్రామానికి చెందిన తోటకూరి మహేష్ యాదవ్ ఆకస్మిత మరణించడం జరిగింది.వారి మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య.

# సమర్థులకే పార్టీ నాయకత్వ బాధ్యతలు...

- ఏఐసీసీ పరిశీలకుడు మానే శ్రీనివాస్







**తిమ్మాపూర్,అక్టోబర్14(పీసీడబ్ల్యూ న్యూస్):** సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సమర్థులను జిల్లా,బ్లాక్, మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ఉద్దేశమని ఏఐసీసీ పరిశీలకుడు మానే శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక కోసం మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్ లో పార్టీశ్రేణుల అభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పటిష్టవంతంగా పార్టీ నిర్మాణ బాధ్యతలు జిల్లా అధ్యక్షులకే అధికంగా ఉంటుందని, అందుకే సమర్థత గల నాయకునికే పార్టీ జిల్లా నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్నదే అధిష్టానం ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ పార్టీ నూతనంగా ప్రవేశపెట్టిన నూతన విధానం పార్టీ పటిష్టతకు దోహదపడుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎంపిక మాదిరిగానే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని ఆయన వివరించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ కోసం కష్టపడ్డవాళ్లకు పార్టీ తప్పకుండా గుర్తించి ఆదరిస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల గెలుపు వెనక కార్యకర్తల కష్టం ఉంటుందని, వారు కష్టపడకుంటే నేతలెవరూ అందలమెక్కరన్నారు. వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకుండా పార్టీ పటిష్టత కోసం అందరం కలిసి కట్టుగా పని చేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే పనులకు దూరంగా ఉండాలని ఆమె హితవు పలికారు. త్యాగాల కుటుంబం నుంచి నేతగా ఎదిగిన రాహుల్ గాంధీ ఆలోచనా విధానం నుంచే సంఘటన్ సృజన్ అభియాన్ పుట్టుకొచ్చిందన్నారు. ఈ కొత్త విధానం పార్టీశ్రేణులకు మరింత మంచి జరుగుతుందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నివర్గాల వర్గాల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తున్నద న్నారు. ఘనమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవల్సిన బాధ్యతమ మనందరిపై ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పారదర్శకంగా అధ్యక్షుని ఎంపిక జరుగుతుం దన్నారు. ఇందులో ఎటువంటి అనుమానాలకు తావులేదన్నారు. పరిశీలకు నిర్మోహమాటంగా తమతమ అభిప్రాయాలు చెప్పుకోవచ్చన్నారు. ఆ సమావేశంలో టీపీసీసీ ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి (మానకొండూర్), గోపగోని బస్వయ్యగౌడ్( శంకరపట్నం), బండారి రమేశ్(తిమ్మాపూర్), ముస్కు ఉపేందర్ రెడ్డి(గన్నేరవరం), ముక్కిస రత్నాకర్ రెడ్డి( బెజ్జంకి), కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి(ఇల్లంతకుంట) తోపాటు పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ పరిశీలకులు అశావహుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

# పాఠశాలలో పరిశుభ్రత కరువు...

- పాఠశాల ఆవరణలో ఎక్కువగా పెరిగిన పిచ్చి మొక్కలు...
- ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న వైద్యులు
- పట్టించుకోని ఉపాధ్యాయులు









**రామడుగు, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులకు పరిశుభ్రత నేర్పాల్సిన ఉపాధ్యాయులే పట్టించుకోనట్లు ఉన్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే రామడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాఠశాలలో పరిశుభ్రత కరువైందని ప్రజలు ఉపాధ్యాయులపై ఆగ్రహిస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే పాఠశాల ఆవరణను చూసి చూడనట్లుగా ఉండటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో ముందడుగు వేస్తుంటే కానీ ఇక్కడ మాత్రం ఉపాధ్యాయులు అందుకు మేము విరుద్ధమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు గుప్పుమంటు న్నాయి. ఇలాంటి పిచ్చి మొక్కలతో పలు వ్యాధులు పిల్లలకు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరి ఇప్పటికైనా ఉపాధ్యాయులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఎన్నికలకు ఘన ప్రారంభం



**మహబూబాబాద్ ప్రతినిధి , అక్టోబర్ 14 (పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో, 'సంఘటన్ సృజన్ అభియాన్ – తెలంగాణ' కార్యక్రమం మంగళవారం మరిపెడ మండలంలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది.ఈ యొక్క కార్యక్రమాన్ని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిస్తూ, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఉందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీ దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ అబ్జర్వర్లు ఎమ్మెల్యే శ్రీ శంకర్, ఎం.డి. అవేజ్, ఇందిరా రావు పాల్గొన్నారు. వారు, "ప్రజల నుండి నాయకత్వాన్ని ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్ష్యం" అని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డా. రామచంద్రనాయక్ మాట్లాడుతూ,"నాయకత్వం ప్రజల అంగీకారంతో, అభిప్రాయంతో ఏర్పడితేనే నిజమైన ప్రజాస్వామ్యం. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం ద్వారా పార్టీ బలోపేతం అవుతుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జన్నా రెడ్డి, భరత్ చందర్ రెడ్డి, మండల-పట్టణ నాయకులు, మాజీ ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ లోపలి ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, స్థానిక నాయకులను ప్రజల ముందుంచే దిశగా కీలక అడుగు అని విశ్లేషకులు పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశం

- నవీన్ యాదవ్ 50,000 ఓట్ల మెజారిటీతో గెలుస్తారని జంగా రాఘవ రెడ్డి ధీమా



**హైదరాబాద్ , ప్రతినిధి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసఫ్‌గూడ్ డివిజన్ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశం ఘనంగా జరిగింది. బిఆర్ఎస్ నేతలు ఎన్నీ కుట్రలు చేసినా నవీన్ యాదవ్ గెలుపుని ఎవరు ఆపలేరు. ఆయన 50,000 ఓట్ల మెజారిటీతో గెలుస్తారాని తెలంగాణ ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ, "జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచారు. మన అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించి, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి" అని పిలుపునిచ్చారు.గత బి ఆర్ ఎస్ నాయకుల వ్యాఖ్యలను స్పర్శిస్తూ, జంగా రాఘవ రెడ్డి "గత మూడు ఎలక్షన్లలో టిఆర్ఎస్ అభ్యర్థి కూడా ఫేక్ ఓట్లతో గెలిచాడు అని ప్రశ్నించారు.అంతేకాదు, గత 10 సంవత్సరాలుగా BRS ప్రభుత్వం చేయని అభివృద్ధిని కాంగ్రెస్ రెండు సంవత్సరాల్లో పూర్తిచేసిందని, BRS ఎమ్మెల్యేలు ఇంకా ఓట్ల కోసం తిరుగుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసిసి సెక్రటరీ విశ్వనాథన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రజా ప్రతినిధులు , జిల్లా నాయకులు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ ఏర్పాటును విజయవంతం చేయండి

**● జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్**



**మల్లంపల్లి మండల ప్రతినిధి అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలో మంగళవారం రోజు జరిగిన బీసీల సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం మరో తెలంగాణఉద్యమం తరహా ఉద్యమ కార్యచరణకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. కనీసం బీసీ లకు ఎంపీటీసీ,సర్పంచ్ జెడ్పిటిసి ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించరా అంటూ ప్రశ్నించారు. గత 30 ఏళ్ల నుండి బీసీల జనాభా గణనీయంగా పెరిగిన తగిన రిజర్వేషన్ లేక అన్ని రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారు. కనీసం స్థానిక ఎన్నికలలోనైనా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేరా ఇదెక్కడి వ్యవస్థ అని అన్నారు. మనమెంతో మనకంత వాటా కావాలని బీసీ బిడ్డలుగా ముక్త కంఠంతో చెబుతున్నాం మాకు రాజకీయాలు ముఖ్యం కాదు, రాజ్యాధికారం బీసీలకు కావాలి. అగ్రకులాల అధిపత్యంలో బీసీలు నలిగిపోతున్నారు అని శ్రీకాంత్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు .అందుకే బీసీ లందరూ రాజకీయాలకతీతంగా కుల సంఘాలు ప్రజా సంఘాలు ఐక్యతగా ఇదే ఆహ్వానంగా భావించి ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ నిర్వహించే బందును విజయవంతం చేయడానికి ములుగు జిల్లా కేంద్రంలో ని రిటైర్డ్ ఉద్యోగుల భవనం లో16వ తేదీ గురువారం ఉదయం జరుగుతున్న బీసీల జేఏసీ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పోనుగోటి రవి, గోల్కొండ రాజు, మహమ్మద్ బాబుల్, కుక్కల సంపత్, నాయకుల శేఖర్, నారోజు అఖిల్, మహమ్మద్ ఖలీల్, భాస్కర్ గౌడ్, చింత నిప్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం యూత్ కమిటీ పాటుపడాలి

**● నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు**

**● నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం టౌన్ యూత్ కమిటీ ఎన్నిక**

**● ఖమ్మం టౌన్ యూత్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా అద్దంకి రవి, దోమకొండ మధు**








**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నూతనంగా ఎన్నికైన నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం టౌన్ యూత్ కమిటీ నాయి బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధి కోసం పాటుపడాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం నగరంలోని నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నూతన నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం టౌన్ యూత్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఖమ్మం టౌన్ యూత్ ప్రెసిడెంట్ గా అద్దంకి రవి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా గుండ్లపల్లి నరేష్, సురభి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గా జూలూరు మహేష్, జనరల్ సెక్రటరీ గా దోమకొండ మధు, సెక్రటరీ గా ఆలేటి రవితేజ, యూత్ కోశాధికారిగా జూలూరి నాగరాజు, యూత్ ప్రచార కార్యదర్శిగా యలమందల నవీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అండర్ 19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఎంపికైన బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి నాయిని శ్రీజ

**● హిమాచల్ ప్రదేశ్‌లో జాతీయస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19లో ఎంపిక**



**బెల్లంపల్లి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల యందు ఇటీవల జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఎంపికైనటువంటి నాయిని శ్రీజ సెకండియర్ హెచ్ ఇ సి విద్యార్థిని మహబూబాబాద్ లో జరిగిన జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడి జరగబోవు హిమాచల్ ప్రదేశ్ లో జాతీయస్థాయిఎస్ జి ఎఫ్ అండర్ 19 కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవు నూరి అంజయ్య చేతుల మీదుగా అవార్డు మెడల్ సర్టిఫికెట్ కళాశాల ప్రాంగణంలో ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిని ఇలాంటి విజయాలను మరెన్నో సాధించాలని చదువుతోపాటు ఆటలలో రాణించాలని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ అండర్ 19 కార్యదర్శి పి.డి బాబురావు, కళాశాల స్పోర్ట్స్ ఇన్చార్జి చంద్రయ్య, పలువురు అధ్యాపకులు, అధ్యాపక పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ పీఓలు సమాజ సేవలో విద్యార్థులను భాగస్వాములను చేయాలి: కేయూ వీసీ ప్రతాప రెడ్డి






**ఖమ్మం, అక్టోబర్ 14 (పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం నగరంలోని గాయత్రి డిగ్రీ కళాశాల వేదికగా కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక సేవ పట్ల అవగాహన పెంచడం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ, “ఎన్ఎస్ఎస్ ద్వారా మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టడానికి ప్రస్తుతం ‘మేరా యువ భారత్ (మై భారత్)’ను ఎన్ఎస్-ఎస్‌తో అనుసంధానించారు. దీని ద్వారా ఎక్కువ మంది విద్యార్థులను సమాజ సేవలో భాగస్వాములను చేయవచ్చు” అని తెలిపారు. ఎన్ఎస్-ఎస్ పీఓలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులను సామాజిక సేవలో చురుకుగా పాల్గొనేటట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ పీఓలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ మాట్లాడుతూ, కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు పెంచడం యాజమాన్య బాధ్యతగా భావించాలని, ప్రతి యూనిట్ విద్యార్థుల్లో సామాజిక సేవ పట్ల అంకితభావం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనంద్ బాబు, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నవీన్ బాబు, గాయత్రి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కె. సునీల్ కుమార్, డైరెక్టర్ కుటుంబరావు, ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్. జయప్రద తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక సభకు సన్నద్ధం కండి: సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు

**● బి.సి. రిజర్వేషన్లపై దొంగాట తగదు**

**● గ్రామ గ్రామాన ప్రచారం - భారీ జన సమీకరణకు పిలుపు**




**ఖమ్మం, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) శతవసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే చారిత్రక బహిరంగ సభకు పార్టీ శ్రేణులు గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి, భారీ జనసమీకరణకు సన్నద్ధం కావాలని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఖమ్మం సభ ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని గుర్తుచేశారు. నిజాం రాజ్యాన్ని కూలదోసి తెలంగాణను భారతదేశంలో విలీనం చేయించిన చారిత్రక తెలంగాణ పోరాటానికి కమ్యూనిస్టులే నాంది పలికారన్నారు. స్వాతంత్ర్యం తరువాత రైతు, కార్మిక, పేద ప్రజల హక్కుల కోసం పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందని చెప్పారు. భూమి దున్నేవారికే భూమి అనే నినాదం ద్వారా సామాజిక న్యాయం సాధించిందని వివరించారు. పార్టీ 100 ఏళ్ల పోరాట చరిత్ర, త్యాగాలను నేటి తరానికి పరిచయం చేయడమే శతవసంత ఉత్సవాల లక్ష్యమని తెలిపారు. డిసెంబర్ 26న జరగబోయే బహిరంగ సభకు లక్షలాది మంది హాజరుకానుండగా, 40 దేశాల నుండి ప్రతినిధులు పాల్గొననున్నారని సాంబశివరావు వెల్లడించారు. సభ విజయవంతం కావడానికి గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి, సభలు, సెమినార్లు, కళారూపాల ద్వారా కమ్యూనిస్టు ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. **బి.సి. రిజర్వేషన్లపై దొంగాట తగదు:** రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు బి.సి. రిజర్వేషన్లపై ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఒకవైపు మద్దతు ప్రకటిస్తూనే మరోవైపు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బి.సి.లకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం జరిగే పోరాటాలకు సి.పి.ఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. బీజేపీ బి.సి. వ్యతిరేక పార్టీగా చరిత్రలో నిలిచిపోతుందని సాంబశివరావు వ్యాఖ్యానించారు. 18 నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావలసిన ఆర్థిక మొత్తాలు అందకపోవడం దారుణమని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల ఉద్యమాలకు సి.పి.ఐ మద్దతు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ

**- పశువుల వ్యాధి నిరోధక టీకాలు: డాక్టర్ రాజశేఖర్**



**పెద్దవంగర అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం 15 అక్టోబర్ 20వ తారీకు నుండి నెల రోజులపాటు నిర్వహించబడును. కావున ప్రతి గ్రామంలోని రైతులందరూ నాలుగు నెలల వయసు నిండిన దూడల నుంచి మొదలుకొని, అన్ని రకాల పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోగలరని మనవి. అలాగే రైతులు, పశువులకు జ్వరాలు వస్తాయి మరియు పాలు తగ్గుతాయి అనే అపోహలకు పోకూడదు ఎందుకంటే జ్వరము మరియు పాలు తగ్గడం అనేవి తాత్కాలికమైనవే, ఒకవేళ పశువుకు టీకా వేయించకపోతే, దానికి గాలికుంటు వ్యాధి వచ్చినట్లయితే దాని యొక్క పని చేసే సామర్థ్యము పాల ఉత్పత్తి తగ్గిపోతుంది కాబట్టి ఖచ్చితంగా రైతులు గాలికుంటు టీకాలు వేయించుకోగలరు. తెలియచేసినారు

## ఎర్రోళ్ల విజ్జయ్య చిత్ర పటానికి శ్రద్ధాంజలి

**- ఘటించిన మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేలు**




**యాదాద్రి అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సిద్దిపేట్ జిల్లా గంగాపూర్ గ్రామంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి విజ్జయ్య ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి,మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్,గ్యాదర్ కిషోర్ కుమార్,పైళ్ల శేఖర్ రెడ్డి,రవీందర్ కుమార్, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో భేటీ

**- భేటీలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**- ఎన్నికల ప్రచార అంశాల మీద చర్చించిన నేతలు**



**షాద్ నగర్,అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో అవలంభించాల్సిన అంశాలపై జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే దివంగత పి జనార్దన్ రెడ్డి తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి గారిని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వారి నివాసంలో బేటీ అయ్యారు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ భేటీలో పలు అంశాలపై చర్చించిన నేతలు

## ములుగు తాత్కాలిక బస్టాండ్ బురదమయం






**ములుగు అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగులోని లక్ష్మీనగర్ వద్ద ఉన్న ములుగు జిల్లా కేంద్రంలోని తాత్కాలిక బస్టాండ్ వర్షపు నీరు, బురదతో అధ్వానంగా తయారైంది. బస్సులు బురదలో దిగబడటం వల్ల డ్రైవర్లు ప్రాంగణంలోకి రావడం మానేశారు. దీంతో ప్రయాణికులను రోడ్డుపైనే ఎక్కించుకోవడం, దించుకోవడం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు స్పందించి, తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత సైనిక శిక్షణకు సువర్ణావకాశం!

**వలిగొండ,అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మన గ్రామ యువత కోసం ఒక గొప్ప అవకాశం! డిఫెన్స్ ఉద్యోగాలకు (సైనిక/రక్షణ రంగం) వెళ్లాలనుకునే యువతీయువకులకు మా సైనిక గ్రూప్ / సైనిక యువత మోటివేషనల్ సొసైటీ తరపున ఉచిత శిక్షణ అందిస్తున్నాం. శిక్షణా వివరాలు:శిక్షణ: మాజీ సైనికులచే రెండు నెలల ఉచిత శిక్షణ. వసతి: భోజన సౌకర్యం మరియు వసతి గది (రూము) పూర్తిగా ఉచితం. ఇతర సౌకర్యాలు: చదువుకోవడానికి అవసరమైన బుక్స్, రెండు జతల యూనిఫాం మరియు షూస్ ఉచితంగా ఇస్తాము. ఎవరి కోసం: డిఫెన్స్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న మన గ్రామంలోని యువత కోసం. సంప్రదించవలసిన వారు:పి. రామకృష్ణ ముదిరాజ్. హెడ్ కానిస్టేబుల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ మేడ్చల్/అంబర్పేట్పదవి: మేడ్చల్ మాల్కాజ్గిరి జిల్లా ఇన్‌ఛార్జ్ సంప్రదించవలసిన నంబర్: 8712594853ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి! జై హింద్!.

# “సంతకం రానోడు సర్పంచ్ - చీకట్లో వెలుగు చూపేనా?”

**వాజేడు అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇది నేటి గ్రామీణ భారతానికి అద్దం పట్టే ఒక చేదు వాస్తవం.సంతకం పెట్టడం రాని వ్యక్తి సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తుండటం కేవలం విచిత్రం కాదు ం అది మన ప్రజాస్వామ్యంలోని విలువలు ఎటు దిశగా వెళుతున్నాయో చూపించే భయానక సంకేతం. ఒకప్పుడు నాయకత్వం అంటే జ్ఞానం, సేవ, నిబద్ధత, నిజాయితీ.ఇప్పుడు నాయకత్వం అంటే డబ్బు, మద్యం, మాంసం, మరియు మాయాజాలం.బడి చదివినవాడు కూడా ఈరోజు తన ఓటు విలువను మద్యం సీసా కొలతతో కొలుస్తున్నాడు.“ఇతడు చదువుకున్నాడు” అని గర్వపడే మనిషి, ఓటు సమయంలో “ఎవడు ఎక్కువ మందు ఇస్తాడో వాడికే” అని తల వంచుతున్నాడు. ఇది కేవలం ఎన్నికల పతనం కాదు మన విలువల పతనం.ఎడ్యుకేషన్ పుస్తకాలలోనే నిలిచిపోయిందిబీ ఆచరణలో మాత్రం మత్తు, మాయా, మమకారాలు పాకాయి.సంతకం పెట్టలేని సర్పంచ్, తన పేరునే రాయలేని వాడు, ప్రజల సమస్యలు రాస్తాడా? పెట్టుబడిదారుల చేతిలో బొమ్మలా మారిపోతాడు.తన కోసం కాదు ం తన వెనుక ఉన్న దందా దారుల కోసం పాలన చేస్తాడు. అంతకన్నా బాధ ఏమిటంటే ం బడి చదివినవాడే ఆ అజ్ఞానాన్ని గెలిపిస్తున్నాడు. తను చదువుకున్న జ్ఞానం మద్యం సీసాలో కరిగిపోతుంది.తను చదువుకున్న న్యాయం, తన జేబులో వేసుకున్న నోట్లతో కొట్టుకుంటుంది.ప్రజాస్వామ్యం అంటే “ప్రజల చేతిలో అధికారం” అని అర్థం.కానీ ఇప్పుడు “డబ్బున్నవాడి చేతిలో ప్రజలు” అనే అర్థం మారిపోయింది. ఓటు ఒక పవిత్రమైన ఆయుధం ం కానీ ఇప్పుడు అది అమ్మకానికి పెట్టిన వస్తువు.ఓటు అంటే ఒక్క సంతకం కాదు, అది భవిష్యత్తుపై సంతకం.మన గ్రామం, మన పిల్లలు, మన భవిష్యత్తు ఎటు వెళ్లాలో నిర్ణయించే సంతకం. కానీ ఆ సంతకం మనం మత్తులో వేస్తున్నాం.విద్యా వెలుగు ఉన్నవాడు చీకటిని జయించాలి.కానీ ఇక్కడ చీకటే వెలుగుపై గెలుస్తోంది.అజ్ఞానం గర్వంగా నిలుస్తుంది, జ్ఞానం బలహీనంగా మౌనంగా ఉంటుంది.ఈ పరిస్థితి మారాలంటే ంమనం మద్యం కంటే మేధస్సుకు, నోట్ల కంటే నిబద్ధతకు,వాగ్దానాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మన గ్రామానికి నాయకుడు కావాల్సింది సంతకం పెట్టలేని వాడు కాదు ంప్రజల మనసు చదవగల వాడు కావాలి.పాఠశాలల్లో నేర్చుకున్న పాఠాలు ఓటు పెట్టే వేళలో గుర్తుకు రావాలి.ప్రజాస్వామ్యం మద్యం సీసాలో మునిగిపోకూడదు.అది మన చేతుల్లో ఉన్న భవిష్యత్తు పుస్తకమై ఉండాలి.ఇది మన గ్రామీణ భారతదేశం యొక్క అత్యంత వాస్తవిక దృశ్యం. సంతకం పెట్టలేని వాడు సర్పంచ్ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నాడు,అయితే పది, పన్నెండు సంవత్సరాలు బడి చదివిన వాడు,వాడి ఇచ్చే మద్యం కోసం ఆశపడుతున్నాడు.ఇది రాజకీయ వ్యవస్థలోని క్షీణత కాదు ంఇది ప్రజాస్వామ్య విలువల పతనం. ఓటు విలువను మనమే తక్కువ చేసుకుంటున్నాం. అజ్ఞానం అధికారం దిశగా: ఒకప్పుడు నాయకుడు అంటే గ్రామానికి మార్గదర్శి.ఇప్పుడు నాయకుడు అంటే మద్యం పంచేవాడు, నోట్ల సంచుల కాపరి.సర్పంచ్ పోటీ అంటే సేవా వేదిక కాదు,దోపిడీకి ద్వారం అయిపోయింది.చదువుకున్నవాడు మద్యం కోసం చేతులు చాపుతుంటే,చదువు లేనివాడు అధికారానికి కాలు వేస్తున్నాడు.ఇది ఒక మానసిక దరిద్రం. ప్రజాస్వామ్యం పుస్తకాలలో మాత్రమే నిలిచి,గ్రామాల్లో అది మద్యం–మాంసం రాజకీయాలుగా మారిపోయింది.ఓటు విలువ ం సీసా కొలతలో: ప్రజలు తమ ఓటును ఒక పవిత్ర హక్కుగా కాకుండా,ఒక మత్తు వ్యాపారంలా తీసుకుంటున్నారు.”ఎవడు ఎక్కువ మందు ఇస్తాడో వాడికే” అనేది ఇప్పుడు కొత్త నినాదం.ఆ ఓటు సీసాలో తేలిపోతుంది, భవిష్యత్తు చీకటిలో మునుగుతుంది.ఓటు అంటే భవిష్యత్తుపై సంతకం.కానీ మనం మత్తులో ఆ సంతకం చేస్తున్నాం. అందుకే చీకటి పాలన మన తలలపై నిలబెడుతోంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు: మహిళలకు అవకాశం లేదా ప్రదర్శన? సర్కారు గ్రామస్థాయిలో రిజర్వేషన్‌లు ఇచ్చింది ంసర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థాయిలో మహిళలకు 50% రిజర్వేషన్. ఇది మంచి నిర్ణయమే అనిపించినా,వాస్తవం మాత్రం వేరే ఉంది. సంతకం పెట్టలేని పురుషులు మాత్రమే కాదు,చదువుకోని మహిళల పేర్లతో తమ భర్తలు, అన్నలు, తండ్రులు అధికారాన్ని వాడుతున్నారు. “పెద్దమ్మ పేరు – మగోడ పాలన” అనే వ్యవస్థ ఏర్పడింది. అంటే, రిజర్వేషన్ ఉన్నా “అసలు అధికారం” మళ్లీ పాత చేతుల్లోనే ఉంది.మహిళా సర్పంచ్ అంటే, కాగితం మీద పేరు మాత్రమే. నిర్ణయం తీసేది వేరొకరు.ఇది రిజర్వేషన్ కాదు, నకిలీ ప్రతినిధిత్వం. ప్రశ్న – ఎంపీ, ఎమ్మెల్యే స్థాయిలో రిజర్వేషన్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థాయిలో రిజర్వేషన్ ఇవ్వగలిగిన ప్రభుత్వం,ఎంపీ, ఎమ్మెల్యే స్థాయిలో మాత్రం 42% రిజర్వేషన్ ఇవ్వడానికి భయపడుతోంది.ఎందుకు? ఎందుకంటే అక్కడ డబ్బు పెద్దది.అక్కడ పార్టీలు తమ లెక్కలతో రాజకీయాలు నడిపిస్తాయి.మహిళలకు అక్కడ అవకాశం ఇవ్వడం అంటేపురుషాధికారం బలహీనమవడం. పార్టీలు మాటలతో చెబుతాయి “మహిళల భాగస్వామ్యం పెంచాలి” అని,కానీ టికెట్లు మాత్రం 8% నుంచి 10% వరకూ మాత్రమే ఇస్తాయి.ఒక చేతితో స్త్రీ శక్తి నినాదాలు,మరో చేతితో టికెట్ జాబితా నుంచి తొలగింపులు.ఇది రాజకీయ దొంగతనం కాదా? గ్రామస్థాయి రిజర్వేషన్ – ఒక దర్పణం, కానీ విరూపం: మహిళలు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌గా ఎన్నికవుతున్నా,వాస్తవంగా పాలన పురుషుల ముసుగులోని వ్యవస్థ చేతిలోనే ఉంది.ఆమె పేరు మీద చెల్లింపులు, ఒప్పందాలు, దోపిడీలు జరుగుతున్నాయి. తన సంతకం ఎక్కడ వేయాలో కూడా ఆమెకు తెలియదు.ఇది “అధికారంలో మహిళా ముఖం, కానీ అధికారం మాత్రం మగ చేతుల్లో” అనే వాస్తవం.చదువుకున్నవారి మౌనంగా ఉండటం – మరింత ప్రమాదం: మద్యం తీసుకున్న బడి చదువుకున్న యువకుడుతన గ్రామాన్ని మద్యం సీసాకు అమ్మేస్తున్నాడు.తను బడి చదివి కూడా తన ఓటు విలువను తెలియకుంటే, చదువు ఎక్కడ ఉపయోగం? బడి చదువుకున్నవాడిని ఓడించడానికిజ్ఞానం ఉన్నవాడు మద్యం సీసా వద్ద వంగిపోతే,ప్రజాస్వామ్యం అర్థం లేకుండా పోతుంది. “రిజర్వేషన్” కంటే “సచేతనత” ముఖ్యం: రిజర్వేషన్ ఒక తాత్కాలిక ప్రోత్సాహం మాత్రమే.అసలు మార్పు రావాలంటే ప్రజలలో సచేతనత, విలువల అవగాహన రావాలి.ఓటు అంటే “బాధ్యత” అని నేర్పించాలి.ఓటు అంటే “మద్యం, మాంసం” కాదు “మార్పు” అని చెప్పాలి. రాజకీయ పార్టీలు – స్త్రీ శక్తి పై ముసుగు రాజకీయాలు: పార్టీలు ఎన్నికల సమయంలో “నారీ శక్తి” అనే నినాదం పెట్టి, ఎన్నికల తర్వాత ఆ శక్తిని గృహకోణంలో బంధిస్తాయి.42% రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఎందుకంటే ఆ సీట్లు మగ నాయకుల చెంత నుంచే పోతాయి.పురుషాధికారం రక్షించుకోవడానికి వాళ్లు “సమయం సరైంది కాదు” అంటారు.అంటే, మహిళల సమయం ఎప్పుడూ రాదు అన్న మాట. మనం మారకపోతే ఎవరు మార్చగలరు?: ఒక గ్రామం సర్పంచ్ సంతకం రానోడు అయితే,అది ఆ గ్రామం ఓటర్ల ప్రతిబింబమే.ఎవడు గెలుస్తాడో కాదు ఎవడిని గెలిపిస్తున్నామో ఆలోచించాలి.మనం మత్తులో వేసిన ఓటు,తర్వాత సంవత్సరాల దోపిడీకి మారిపోతుంది.ప్రజాస్వామ్యం రక్షణ మన చేతుల్లోనే ఉంది.మార్పు ఎక్కడ మొదలవాలి? : మార్పు పాఠశాలల్లో మొదలవాలి.పిల్లలకు “ఓటు విలువ” నేర్పించాలి.చదువు అంటే పుస్తకం మాత్రమే కాదు,సమాజానికి సమాధానం ఇవ్వగల ఆలోచన. “సంతకం రానోడు సర్పంచ్ కావొచ్చు, కానీ మనం సంతకం పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మద్యం కాదు, మన భవిష్యత్తు మన చేతుల్లో ఉంది.” “జడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు సరిపోవు, పార్లమెంటు, అసెంబ్లీలు కూడా మహిళల ధైర్యంతో నిండాలి.”“మద్యం సీసా తెరిచి మత్తు కొనొద్దు ఓటు సీసా తెరిచి మార్పు రాయండి.”





వార్త రచయిత జనగాం ప్రసాద్ రావు (పూసూరు) ఫోన్: 76720 82695

# పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు

- డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సిఎం


**ఖమ్మం (ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బకాయిల కోసం తరగతి గదుల నుంచి పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.రాష్ట్ర డిప్యూటీ సీఎం మంగళవారం హైదరాబాద్ నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంపై, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం క్రింద ప్రైవేటు పాఠశాల యజమానులు వారి పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజు కట్టమని అడగటం, విద్యార్థులను బయటకు పంపడం వంటి వాటికి పాల్పడితే తీవ్రంగా పరిగణించి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా





కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యజమానులతో సమావేశమై పిల్లలను ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కు ఏడైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. విద్యారంగంపై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమ పద్ధతిలో విడుదల చేస్తుందని, బకాయిల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ స్కూల్స్ తో బెస్ట్ అవైలబుల్ స్కూల్ క్రింద ఎంఓయూ చేసుకునే సమయంలోనే ఫీజులను దృష్టిలో ఉంచుకొని పిల్లలను ఇబ్బంది పెట్టకూడదనే నిబంధన ఉంటుందని అన్నారు. పిల్లలను బయటకు పంపడంపై తీవ్రంగా పరిగణించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యా హక్కు చట్టం నిబంధనలను కలెక్టర్ లు పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సంక్షేమ శాఖల అధికారులు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ పిల్లలను అవసరమైతే మరో బెస్ట్ అవైలబుల్ స్కూలుకు వెంటనే బదిలీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీక్ష లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో దసరా తర్వాత పిల్లల అటెండెన్స్ గమనించాలని, సంబంధిత పాఠశాల యజమానులతో చర్చించి పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పరిపాలన అధికారి ఏ. నారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలి: పుప్పాల దీపక్ పటేల్



**గణపురం,అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని పుప్పాల దీపక్ పటేల్ డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ ఇవ్వడం అగ్రకులాలకు మింగుడు పడటం లేదని, ఈ అంశంలో రాజకీయ పార్టీలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు.కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ బీసీలకు చట్టసభలో రిజర్వేషన్ విషయంలో వెనుకడుగు వేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి పార్టీ లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు తమ తమ పార్టీ జెండాలు మోస్తూ అగ్రవర్ణాలను అధికారంలోకి తెస్తున్నాయన్నారు.భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీల ఐక్యతతో రాజ్యాధికారం వైపు ప్రయాణం సాగించాలన్న ఆలోచనతో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇవ్వాలని పటేల్ అభిప్రాయపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం

- ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీహాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ మ్యాప్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణ మ్యాప్ లను పరిశీలించి, ఆర్ అండ్ బీ అధికారులు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... ఖమ్మం రూరల్ మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, భవనాలు, కావాల్సిన వసతుల నమూనా తయారు చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్,



ఎంపిడిఓ, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయ శాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా సముదాయం ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అంతర్గతంగా 30 ఫీట్ల రోడ్డు, ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలని అన్నారు. మండల కార్యాలయ సముదాయానికి అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్ లో పొందుపర్చాలని అన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టేందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డిఇ భగవాన్, ఏఇ కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# విండీస్‌తో రెండో టెస్టులో సిరాజ్ అరుదైన ఫీట్



హైదరాబాదీ ఏస్ పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టుల్లో అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. ఈ ఏడాది అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. సోమవారం నాలుగో రోజు వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ వికెట్ ను తీసిన అనంతరం ఈ ఏడాది లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఏడాది 8 మ్యాచ్ లు ఆడిన సిరాజ్.. 1575 బంతులు వేశాడు. రఫ్ గా చెప్పాలంటే 262.3 ఓవర్లను నిలకడగా బౌలింగ్ చేశాడు. మొత్తంమీద 37 వికెట్లను తీశాడు. అతని సగటు 26.91 కావడం విశేషం. ఓవరాల్ గా తను ఈ ఏడాది టెస్టుల్లో 39 మెయిడిన్లు వేశాడు. అలాగే 996 పరుగులను సమర్పించుకున్నాడు. తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 6-70 కావడం విశేషం. ఇక 42.56 స్ట్రైక్ రేట్ తో 3.79 ఎకానమీ రేటుతో తను బౌలింగ్ చేశాడు. ఓవరాల్ గా తన ఖాతాలో రెండు నాలుగు వికెట్ల ప్రదర్శన, రెండు ఐదు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. వెస్టిండీస్ తో రెండో టెస్టు కుముందు 36 వికెట్లతో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. తను ఈ ఏడాది 9 మ్యాచ్ లు ఆడి, 276.4 ఓవర్లు వేశాడు. సగటు 28.63 కాగా, 47 మెయిడిన్లను వేశాడు. ఇక వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ను కొనసాగించిన వెస్టిండీస్ సోమవారం నాలుగో రోజు 118.5 ఓవర్లలో 390 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ ను నిర్దేశించింది. ఇక ఈ మ్యాచ్ లో నాలుగో రోజు బ్యాటింగ్ చేసి, ఓపెనర్ జాన్ క్యాంబెల్ (199 బంతుల్లో 115, 12 ఫోర్లు, 3 సిక్సర్లు), షాయ్ హోప్ (214 బంతుల్లో 103, 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో సత్తా చాటారు. మూడో వికెట్ కు వీరిద్దరూ కలిసి 177 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో టీమిండియా ముందు 100o రన్స్ టార్గెట్ ఉంచగలిగింది. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రాకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్.. ఆటముగిసేసరికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (8) త్వరగా ఔటవగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (25 బ్యాటింగ్), వన్ డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంకా విజయానికి భారత్ కు 58 పరుగులు కావాలి. తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్.. రెండు టెస్టుల సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ కు మంగళవారం ఆఖరిరోజు. దాదాపు లంచ్ విరామం లోపలే ఈ మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉంది. ఇక తొలి ఇన్నింగ్స్ ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (175) టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరోవైపు తమ తొలి ఇన్నింగ్స్ లో విండీస్ 248 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 270 పరుగుల లీడ్ ఇండియాకు దక్కింది.

## ఎంఎస్ ధోని సంప్రదాయాన్ని గిల్ బ్రేక్ చేశాడా




భారత క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను గెలిచి అద్భుత ప్రదర్శన చేసింది, అయితే ఈ విజయంతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ధోనీ సంప్రదాయాన్ని బ్రేక్ చేయడం కూడా చర్చనీయాంశమైంది. భారత మాజీ కెప్టెన్ ధోనీ ఒక సంప్రదాయాన్ని ప్రారంభించాడు, అదేమిటంటే, టీమ్ ఇండియా సిరీస్‌ను గెలిచినప్పుడల్లా, ట్రోఫీని జట్టులోని కొత్త ఆటగాడికి అందజేస్తారు. దీని ఉద్దేశ్యం ఏమిటంటే జట్టులో ఐక్యతను పెంపొందించడం, కొత్త ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం. వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్‌ను గెలిచిన తర్వాత,టీమ్ ఇండియా విజయోత్సవ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్వై స్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా నుంచి ట్రోఫీని తీసుకుని, దానిని వైస్ కెప్టెన్ రవీంద్ర జడేజాకు అందజేసినట్లు కనిపించింది. ఇది చూసిన అభిమానులు ఆశ్చర్యపోయారు, ఎందుకంటే ధోనీ కాలం నుంచి వస్తున్నట్లుగానే ఈ ట్రోఫీని కొత్త ఆటగాడికి అందజేస్తారని అందరూ భావించారు. సోషల్ మీడియాలో అభిమానులు గిల్ ధోనీ సంప్రదాయాన్ని ముగించాడా, ఇది జట్టు సంస్కృతేనా అని ప్రశ్నలు లేవనెత్తారు.

# యశస్వి ఓపెనింగ్ చేస్తే రోహిత్‌ను మర్చిపోతారు

● మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా సంచలన వ్యాఖ్యలు



టీమ్ఇండియాలో ఇప్పుడు యువ శక్తి మొదలైనట్లు కనిపిస్తోంది. లెజెండరీ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యంగ్ ప్లేయర్స్ మధ్య తీవ్రమైన పోటీ నడుస్తోంది. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో యంగ్ లెఫ్ట్ హ్యాండర్ అదరగొట్టే ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకుని, రోహిత్ శర్మకు అసలైన వారసుడు అతడేనని అందరితోనూ అనిపించుకున్నాడు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతడికి ఇంకా సమయం పడుతుందని పక్కనపెట్టారు. సరిగ్గా ఇదే టైమ్‌లో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఒకరు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చి, అసలు సిసలైన వారసుడు అతడు కాదు, మరొకడు ఉన్నాడని చెప్పి పెద్ద ట్విస్ట్ ఇచ్చాడు. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో తన ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ, రోహిత్ శర్మ స్థానానికి సరైనోడని చాలా మంది భావించారు. ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన సిరీస్‌కు కూడా అతడిని వెంటనే ఎంపిక చేయడంతో, ఆస్ట్రేలియాతో జరగనున్న మెయిన్ సిరీస్‌లో కూడా చోటు ఖాయమని ఊహాగానాలు మొదలయ్యాయి. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, బీసీసీఐ రోహిత్ స్థానంలో అభిషేక్‌ను సిద్ధం చేస్తోందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతన్ని ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంచి అందరికీ షాక్ ఇచ్చారు. అభిషేక్ తన అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పదని స్పష్టం చేశారు. అభిషేక్ శర్మ గురించి చర్చ జరుగుతున్న సమయంలో టీమ్ఇండియాలో మాజీ ఓపెనర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ఒక కొత్త వాదనను తెరపైకి తెచ్చాడు. వన్డేల్లో రోహిత్ శర్మ తర్వాత ఓపెనింగ్ స్లాట్‌కు అభిషేక్ శర్మ కంటే ముందు యశస్వి జైస్వాల్ రేసులో ఉన్నాడని స్పష్టం చేశాడు. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న యశస్వి, త్వరలోనే అన్ని ఫార్మాట్లలో రెగ్యులర్ ప్లేయర్ అవుతాడని జోస్యం చెప్పాడు. "అభిషేక్ శర్మ గురించి చాలా చర్చ జరుగుతోంది, కానీ నా అభిప్రాయం ప్రకారం యశస్వికే మొదట అవకాశం ఇవ్వాలి. అతడిని ఎక్కువ కాలం పక్కన పెట్టలేరు" అని ఆకాశ్ చోప్రా గట్టిగా చెప్పాడు.ఆకాశ్ చోప్రా అంతటితో ఆగకుండా, ఒక సంచలన కామెంట్ చేశాడు. ఒకవేళ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కలిసి వన్డేల్లో ఓపెనింగ్ చేయడం మొదలు పెడితే, వాళ్లిద్దరి దూకుడు ముందు ప్రేక్షకులు రోహిత్ శర్మను కూడా మిస్ అవ్వకపోవచ్చని అన్నాడు. "గిల్ ఇప్పటికే కెప్టెన్సీ బాధ్యతలతో ముందుకు వెళ్తున్నాడు. అతడితో పాటు యశస్వి ఓపెనింగ్ చేస్తే, ఆ కాంబినేషన్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అప్పుడు బహుశా రోహిత్ లేని లోటు కూడా ఎవరికీ తెలియకపోవచ్చు" అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో విశ్లేషించాడు. ఇది రోహిత్ ఫ్యాన్స్‌కు అంతగా నచ్చకపోయినా, టీమ్ఇండియాలో ఫ్యూచర్ ప్లాన్స్‌కు అద్దం పడుతోంది.ఆకాశ్ చోప్రా కేవలం వన్డేల గురించే కాదు, టీ20 ఫార్మాట్ గురించి కూడా తన అంచనాలను పంచుకున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్ తర్వాత, టీమ్ఇండియాలో టీ20 ఓపెనింగ్ స్లాట్‌లో పెద్ద మార్పులు జరగవచ్చని అన్నాడు. అప్పటికి, యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ ఇద్దరూ ఓపెనర్లుగా మారే అవకాశం ఉందని, అప్పుడు శుభ్‌మన్ గిల్‌ను నంబర్ 3 స్థానంలో ఆడించవచ్చని అభిప్రాయపడ్డాడు. యశస్వికి ఎప్పుడు అవకాశం వచ్చినా దాన్ని యూజ్ చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఒకసారి అతను జట్టులో స్థిరపడితే, ఇక ఇతరులను ఎవరూ మిస్ అవ్వరు.

# రెండో టెస్టులో భారత్ ఘన విజయం..

**7 వికెట్ల తేడాతో వెస్టిండీస్ పై విక్టరీ**

**గిల్ కెప్టెన్సీలో 2-0తో తొలి సిరీస్ సొంతం**



శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో-ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. కీలక సమయాల్లో నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ (100 పరుగులు) సాధించాడు. ఇప్పుడు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన స్కోర్‌ను ఛేజింగ్ చేసే క్రమంలో హాఫ్ సెంచరీ చేశాడు. 58 పరుగులతో మ్యాచ్ ముగించాడు. నిన్న మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా అవుట్ అయిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దాడు. తాజా ఇన్నింగ్స్‌తో టెస్ట్ ఫార్మాట్‌లో రాహుల్ ఖాతాలో 20 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలు ఉన్నాయి. సాయి సుదర్శన్ 76 బంతుల్లో 39 పరుగులు చేసి ఔటయ్యాడు. రెండో టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ 87 పరుగులతో రాణించాడు. ఫీల్డింగ్ లోనూ మెరిశాడు. మొదటి టెస్ట్‌లో 50 పరుగులు, ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ విజయానికి కావాల్సిన పరుగులు చేశారు.విండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా ఎపెనర్ యశస్వి జైస్వాల్



219 పరుగులతో సిరీస్‌ను టాప్ స్కోరర్‌గా ముగించాడు. రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను చేసిన 175 పరుగులు సిరీస్ లో అత్యుత్తమ స్కోరు. జైస్వాల్ తర్వాత కేఎల్ రాహుల్ (196 పరుగులు), శుభ్‌మన్ గిల్ (192) ఉన్నారు. వికెట్లలోనూ భారత బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ 12 వికెట్లతో అగ్ర స్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా వరుసగా 10, 8 వికెట్లు తీశారు. భారత్ తొలి ఇన్నింగ్స్ 518/5 వద్ద డిక్లేర్ జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) రాణించారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46) భారత్ రెండో ఇన్నింగ్స్ 124/3 వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ : 248 ఆలౌట్ రెండో ఇన్నింగ్స్: 390 ఆలౌట్ కాంప్‌బెల్ (115), షై హోప్ (103), జస్టి

## బాబర్ అజామ్ ఘోరంగా విఫలం




బాబర్ అజామ్ కష్టకాలం ఇప్పుడిప్పుడే ముగిసేలా లేదు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 23 పరుగులకే ఔటయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోవడం గమనార్హం. రెండో ఇన్నింగ్స్‌లో బాబర్ అజామ్ 72 బంతులు ఆడి, 42 పరుగులు చేశాడు. కానీ, ఆ తర్వాత కగిసో రబాడ చేతిలో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోతున్న బాబర్ అజామ్ తీరు చూసి పాక్ జట్టు ఆందోళనకరంగా ఉంది.టెస్ట్ సెంచరీ కోసం బాబర్ ఆజం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 74 ఇన్నింగ్స్‌లలో ఒక్క టెస్ట్ సెంచరీ కూడా చేయలేదు. 2023 నుంచి అతని బ్యాటింగ్ సగటు కేవలం 23.75 మాత్రమే. బాబర్ ఆజంకు ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, అతని చివరి 28 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో, అతను కేవలం రెండు అర్ధ సెంచరీలు మాత్రమే సాధించాడు. అతను ప్రతిసారీ మంచి ఆరంభాలను పొందినప్పటికీ, వాటిని పెద్ద స్కోర్‌లుగా మార్చలేకపోతున్నాడు. అతని చివరి 15 ఇన్నింగ్స్‌లలో ఉత్తమ స్కోరు 42గా ఉంది.లాహోర్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో బాబర్ అజామ్ స్ట్రెయిట్ డెలివరీలతో అవుట్ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను LBWగా అవుట్ అయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో, ఆఫ్-బ్రేక్ బౌలర్ సైమన్ హార్మర్ అతన్ని LBWగా అవుట్ చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, రబాడ యాంగిల్ చేసిన డెలివరీ అతన్ని స్టంప్‌ల మధ్య క్యాచ్ చేసింది. బాబర్ ఇన్‌కమింగ్ డెలివరీలతో ఇబ్బంది పడుతున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. ఇది సాంకేతిక లోపం వల్ల కావొచ్చు. బాబర్ త్వరలో భారీ టెస్ట్ ఇన్నింగ్స్ ఆడకపోతే, అతను టీ20లలో ఎదుర్కొన్న పరిస్థితినే ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# వ్యూస్ కోసమే హర్షిత్ రాణాపై విమర్శలు

## క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం

టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. యూట్యూబ్ వ్యూస్ కోసం యువ క్రికెటర్ అయిన హర్షిత్ రాణాపై విమర్శలు గుప్పిస్తారా అని మండిపడ్డాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన వన్డే, టీ20 జట్లలో హర్షిత్ రాణాకు చోటు దక్కడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.గౌతమ్ గంభీర్‌కు ప్రియ శిష్యుడు కావడంతోనే హర్షిత్ రాణాకు మూడు ఫార్మాట్లలో అవకాశాలు దక్కుతున్నాయని క్రిష్ శ్రీకాంత్‌తో పాటు పలువురు నెటిజన్లు ఆరోపించారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్రతిభ హర్షిత్ రాణాకు లేదని అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా హర్షిత్ రాణాపై వచ్చిన విమర్శలను గంభీర్ ముందు ప్రస్తావించగా ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'యూట్యూబ్ వ్యూస్ కోసం 23 ఏళ్ల ఆటగాడిని విమర్శించేందుకు సిగ్గుండాలి. ఇలా మాట్లాడటం అన్యాయం. హర్షిత్ రాణా తండ్రి మాజీ చీఫ్ సెలెక్టర్ కాదు. మాజీ క్రికెటర్ కూడా కాదు. చివరకు ఎన్ఆర్ఐ కూడా కాదు. అతను ఎవరి మద్దతు లేకుండా తన సొంత ప్రతిభతో క్రికెట్ ఆడుతున్నాడు. అవకాశం వచ్చినప్పుడల్లా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ఆటగాళ్లను వ్యక్తిగతంగా లక్ష్యం చేస్తూ మాట్లాడటం సరికాదు. వారి ప్రదర్శన గురించి మాట్లాడండి. ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించేందుకు సెలెక్టర్లు ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా ఓ 23 ఏళ్ల యువకుడిపై ఘాటైన విమర్శలు చేస్తే.. అతని మానసిక స్థితి ఏం కావాలిభవిష్యత్తులో మీ పిల్లలు క్రికెట్ ఆడి.. వారు వ్యక్తిగత దూషణకు గురైతే ఈ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. అతను 23 ఏళ్ల కుర్రాడు. అతనిది 33 ఏళ్ల వయసు కాదు. హెడ్ కోచ్‌గా నన్ను విమర్శించండి. నేను భరించగలను. కానీ 23 ఏళ్ల కుర్రాడిపై అనవసర విమర్శలు చేయడం భావ్యం కాదు. భారత క్రికెట్ పట్ల నైతిక బాధ్యత ఉండాలి. మీ యూట్యూబ్ ఛానెల్ వ్యూస్ కోసం ఇలాంటి విమర్శలు చేయకూడదు. ఇది హర్షిత్ రాణా విషయంలోనే కాదు.. భవిష్యత్తులో ఏ ఆటగాడిపై కూడా ఇలా వ్యక్తిగత విమర్శలు చేయకూడదు.'అని క్రిష్ శ్రీకాంత్‌ను ఉద్దేశించి గంభీర్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.



